# సత్యవాక్కు

సంపుటి -42 జనవరి - 2021 సంచిక - 6




జనవరి - 2021

## క్రైస్తవ మాసపత్రిక

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ ఛానల్‌లో |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ ఛానల్‌లో |
| శుక్రవారం ఉదయం | : | 6.30 గంటలకు MAHAA NEWS ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 గంటలకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 గంటలకు కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 గంటలకు కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanicoc.kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 | జనవరి - 2021 | సంచిక -6

## పనిచేయుట వలన గౌరవము

దేనినయిన సాధించవలెనంటే దానికి తగిన కృషి అవుసరము. పని చేయుటలో మన శక్తి గాని, మానసిక శక్తి గాని లేక ఆత్మీయ శక్తి గాని కావచ్చును. లేదా వీటియొక్క మిశ్రమము కావచ్చును. మానవుడు తన శక్తిని వినియోగించి చేసే పనులన్నియు మంచివి కావు. దేవుని క్రియలు, అపవాది క్రియలను గూర్చి బైబిలు బోధించుచున్నది (యోహాను 6: 29; 8:41).

మన దేశములో పనిచేయుటకు సిగ్గుపడు వారు చాల ఎక్కువ యున్నారు. తమ పనిని తామే చేసి కొనుటకు కించపడువారనేకు లున్నారు. అయితే కష్టించిన వానికే ఫలితము దొరుకును, పని చేయుట వలన గౌరవము లభించును అని మనందరము తెలిసికొనవలసి యున్నది. ఒకడు తన జీవనోపాధిని సంపాదించుకొనుటకు ఏదైనా పని చేయనొల్లని యెడల అది దుష్ప్రవర్తన యని పరిశుద్ధాత్ముడు బోధించుచున్నాడు. అందులోను, పనిచేయుటకు శక్తి సామర్థ్యములు గలవారు పని చేయ నొల్లని యెడల అది దుష్ప్రవర్తనయే గాని మరొకటి

కాదు. అట్టిది పాపము. పని చేయ నొల్లనివాడు పాపి గనుక అట్టివాడు సంఘము నుండి వెలివేయ బడవలెనని లేఖనములు బోధించు చున్నవి. 2 థెస్స 3:6–14లో పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా ఇట్లు పలికెను : "సహోదరులారా, మా వలన పొందిన బోధనప్రకారము కాక, అక్రమముగా నడుచుకొను ప్రతి సహోదరుని యొద్ద నుండి తొలగిపోవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మీకు ఆజ్ఞాపించు చున్నాము...మేము మీ మధ్యను అక్రమముగా నడుచుకొనలేదు; ఎవని యొద్దను ఉచితముగా ఆహారము పుచ్చుకొనలేదు; మేము మీలో ఎవనికిని భారముగా ఉండకూడదని ప్రయాసముతోను, కష్టముతోను రాత్రిం బగళ్ళు పనిచేయుచు జీవనము చేసితిమి. మీరు మమ్మునుపోలి నడుచు కొనవలెనని మమ్మును మేము మాదిరిగా కనుపరచు కొనుటకే యీలాగు చేసితిమిగాని, మాకు అధికారము లేదని చేయలేదు. మరియు మేము మీ యొద్ద ఉన్నప్పుడు ఎవడైనను పనిచేయ నొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని మీకు ఆజ్ఞాపించితిమి గదా. మీలో కొందరు ఏ పనియు చేయక పరులజోలికి పోవుచు, అక్రమముగా నడుచుకొను చున్నారని వినుచున్నాము. అట్టి వారు నెమ్మదిగా పనిచేయుచు, సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని... హెచ్చరించు చున్నాము... ఈ పత్రిక మూలముగా మేము చెప్పిన మాటకు ఎవడైనను లోబడని యెడల అతనిని కనిపెట్టి అతడు సిగ్గుపడు నిమిత్తము అతనితో సాంగత్యము చేయకుడి" (2 థెస్స 3: 6–14).

థెస్సలోనీకయలోని క్రీస్తు సంఘ సభ్యులలో అనేకులు కార్మికులు. ఒక్కో సారి వారు బానిసలతో కలసి పని చేయవలసి వచ్చుచుండెను: అందు వలన కార్మికవృత్తి నీచమైనదని కొందరు భావించుట మొదలిడిరి. వారు పని చేయుట మాని వారి

పోషణార్థమై సంఘము పై ఆధారపడుట మొదలిడిరి. వారిలో కొందరు ఏ పనియు చేయక పరులజోలికి పోవుచు అక్రమముగా నడుచుకొను చున్నారని అపో. పౌలు తెలిసికొనెను. అట్టివారు కష్ట పడి పనిచేసి సొంతముగా సంపాదించు కొనిన ఆహారము భుజింపవలెనని క్రీస్తు యిచ్చిన అధికారమును బట్టి పౌలు వారిని హెచ్చరించెను. సోమరి మెదడు అపవాది యొక్క కర్మాగారము అనే ఆంగ్ల సామెతను మన మెరుగుదుము. ("An idle mind is the devil's work shop") ఏ పనియు లేక యున్నవాడు చివరకు చేసేది అపవాది పని యగును.

పనిచేసికొని బ్రతుకుట గౌరవ ప్రదమైనదని నిరూపించుటకును, థెస్స లోనీకయలో నున్న సహోదరులకు అతడు భారముగా యుండకుండు నిమిత్తమును పౌలు తన సొంత చేతులతో డేరాలను కుట్టుచు ఆ పట్టణములో జీవనము చేసెను. ఆ కాల పరిస్థితులను బట్టి పౌలు అత్యున్నతమైన విద్య నభ్యసించినవాడే అయినను తన సొంత చేతులతో పనిచేయుటకు సిగ్గు పడలేదు. కష్టపడి పనిచేయుట గౌరవ ప్రధమైనదని, మంచిదని అతని తల్లిదండ్రులు ముందుగనే అతనికి నేర్పిరి. వారి నుండియే డేరాలను కుట్టు పనిని అతడు నేర్చుకొనెను. తన కుమారునికి పని చేయుట నేర్పనివాడు అతనికి దొంగతనము నేర్పుచున్నాడను సామెత యూదులలో కలదు. పౌలు చేసిన సువార్త పనికి సహోదరుల నుండి అనగా సంఘము నుండి జీతము పొందనర్హుడే అయినను దాని నతడు వినియోగించుకొనలేదు. ఎఫెసులో పని చేసినప్పుడు కూడ అతడు అదే సూత్రమును పాటించెను. ఎఫెసులో యున్న క్రీస్తు సంఘ పెద్దలతో మిలేతులో అతడు మాటలాడుచు ఆ సంగతిని అతడు వారి కిట్లు జ్ఞాపకము చేసెను : "ఎవని వెండినైనను, బంగారమునైనను, వస్త్రములనైనను నేను ఆశింపలేదు; నా అవసర

ముల నిమిత్తమును, నాతో ఉన్నవారి నిమిత్తము ఈ నా చేతులు కష్టపడిన వని మీకే తెలియును. మీరును ఈలాగు ప్రయాసపడి బలహీనులను సంరక్షింపవలెనని... అన్ని విషయ ములలో మీకు మాదిరి చూపితిని" (అపొ.కా. 20:33-35).

రెండు ప్రాముఖ్య ఉద్దేశములను బట్టి పౌలు కష్టపడి పనిచేసెను. మొదటి ది, అతని జీవనోపాధి కొరకు, రెండవది అవుసరములలో యున్న వారికి సహాయము చేయుటకు, తరువాత 1 తిమో 5:16లోను, యాకోబు 1:27లోను దిక్కులేని వారికి, విధవరాండ్రకు తమ యిబ్బందులలో క్రైస్తవులు సహాయ పడవలెనని వ్రాయ బడి యున్నది. దేవుని యెదుట పవిత్ర మును, నిష్కలంకమైన భక్తియు కలిగి జీవించవలెనన్న అక్కర గలవానికి వంచిపెట్టుటకు వీలు కలుగు నిమిత్తము ప్రతి క్రైస్తవుడు తమ చేతులతో మంచి పని చేయుచు కష్ట పడవలెను (ఎఫెసీ 4:28). సమాజము లో మంచిపేరు కలిగి జీవించుటకును, సమాజమునకు ప్రయోజనకారిగ యుండు నిమిత్తమును ప్రతివాడును తన చేతులతో మంచిపని చేయుచు కష్టపడవలెను. క్రైస్తవులు సంఘమునకు వెలుపటి వారి యెడల మర్యాదగా నడుచుకొనుచు పరుల జోలికి పోక తమ సొంత కార్యములను జరుపు కొనుట యందు తమ చేతులతో పని చేయుట యందు ఆశ కలిగి యుండ వలెనని 1థెస్స 4:12లో హెచ్చరింప బడి యున్నారు. వారు మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగి యుండవలెను (రోమా 12:17). దుర్వ్యాపారము, మోసము, జూదము, దొంగతనము మొదలగు వాటినన్నిటి నుండి క్రైస్తవులు దూరముగ యుండవలెనని లేఖన ములు ఆజ్ఞాపించు చున్నవి. ఇతరులకు హాని కలిగించు పనులేమైనను చేసిన యెడల అది పాపము కాగలదు. ఉదాహరణకు మత్తు పానీయములు తయారుచేయు పనిలో క్రైస్తవులు

నిమగ్నులు కారాదు.

సువార్త ప్రకటనలో సహాయ పడు నిమిత్తము క్రైస్తవులు లాభదాయకమైన మంచి వృత్తులను చేయవలెను. సువార్త ప్రకటింప బడవలెనన్న ధనము అవుసరము. తరువాత, సువార్తను బోధించువారు పోషింప బడవలెను. "సువార్తను ప్రకటించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించి యున్నాడు" అని 1 కొరింథీ 9:14లో వ్రాయబడి యున్నది. అందరు బహిరంగముగా సువార్తను ప్రకటింపలేరు లేక దూరప్రాంతములకు వెళ్ళి వాక్యము నందించలేరు. గాని ఈ గొప్పపనిలో ప్రతి సంఘ సభ్యుడు తన కానుకల నిచ్చుట ద్వారా సహాయ పడగలడు. అట్టి విధముగా కానుక లియ్యవలెనన్న సభ్యులు తమ చేతులతో పనిచేయవలెను. సువార్త వ్యాప్తి నిమిత్తమై కానుక లిచ్చిన వారికి, సువార్తను బోధించేవారికి కలుగు ఫలితము సమానమే.

ఒకడు తన పాపపు జీవితమును జీవించుచు ఈలోక భోగముల ననుభవించు నిమిత్తము మాత్రమే పని చేయుట దోషము. అనేకులు తమ శరీరాశలను తీర్చుకొను నిమిత్తమే పని చేయుట వలన తమ నాశనమునకు తామే కర్తలైరి. ఈ భూమి మీద ధనము కూర్చుకొనరాదని యేసు బోధించెను. "పరలోక మందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెట యైనను, తుప్పైనను దానిని తిని వేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు" అని ఆయన బోధించెను (మత్తయి 6:19,20). దురాశ కలిగి పనిచేయుట కూడ లేఖనములలో నిషేధించబడినది. మానవుడు తిని, త్రాగి తన శరీరాశలను తీర్చుకొను నిమిత్తము అతడు దేవుని స్వరూపములో చేయబడలేదు. అందు నిమిత్తము క్రీస్తు తన పవిత్ర రక్తమును కార్చలేదు గాని అతడు దేవుని సేవించి ఆయనను ఘనపరచు నిమిత్తము ఈ భూమి పై సృజింపబడెను.

పని ఎంత చిన్నదియైనను ఆ

పనిని చేయుట నీచమని అనుకొనుట బుద్ధిహీనతయే, తమ పనులను తాము చేసికొనుటకు భారతీయులు నేర్చుకొనవలసినవి అవసరము ఎంతైనా యున్నది. మానవుడు పాపము చేయక ముందు దేవుడతని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దానిని కాచుటకును దానిలో ఉంచెను (ఆది 2:15). సీనాయి కొండపై దేవుడు తన ధర్మశాస్త్రము నిచ్చుచు మానవుడు పని చేయవలెనని ఆయన ఆజ్ఞాపించెను: "ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను" అని ఆయన ఆజ్ఞాపించెను (నిర్గమ 20:9). కష్టపడి మంచి పనిని చేయు ప్రతివానిని దేవుడు దీవించును. సోమరితనము ఇప్పుడును, మరి యెల్లప్పుడును కూడ మానవజాతికి శాపకారణమే యగును.

నీవు క్రీస్తును నమ్ముకొనుము, ఆయన ఆజ్ఞలకు లోబడుము. క్రైస్తవుడవై మరణ పర్యంతము ఆయనకు సేవ చేయుము. నిత్యజీవాన్ని ఆయన నీకు అంతమందు జీతముగా యిచ్చును.

## పాటలు పాడుట

ఆరాధనలో చేయు ప్రతి క్రియ క్రైస్తవునికి ఆనందదాయకముగా యుండాలి. అయినను అన్నిటి కంటె ఆరాధనలో పాటలు పాడుట మరింత అహ్లాదకరముగా యుండును. చాలా సార్లు మనుష్యులు తమలో తాము పాటలు పాడుకొందురు. లేదా గీతాలాపన చేయుదురు. ఒక్కోసారి వినబడు రీతిగను, మరింకొకసారి నిశ్శబ్దముగను కూనరాగాలు చేయుదురు. క్రైస్తవారాధనలో పాటలు పాడుట ఒక ప్రాముఖ్యమైన భాగమై యున్నది. అయినను దానిని గూర్చిన గందరగోళము ఇంతా అంతా కాదు. గనుక నీ మనస్సు తెరచి, బైబిలు ద్వారా దేవుడు నీతో మాట్లాడనిమ్ము.

కీర్తనలు పాడుటను గూర్చిన ముఖ్య బైబిలు వచనములు రెండున్నవి.

అవి ఎఫెసీ 5:19; మరియు కొలస్స 3:16. అవి రెండు ఇంచుమించు ఒకే లాగున్నవి. "ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను, ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" (ఎఫెసీ 5:19). "సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప నియ్యుడి. మరియు మాట చేతగాని క్రియ చేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరిట చేయుడి" (కొలస్స 3:16, 17).

**పాటలుపాడు ఉద్దేశ్యము**

పాటలు లేక కీర్తనలు పాడుట ఒక విధమైన బోధచేయుటయే. మనము పాడే పాటలలోని మాటల ద్వారా మనం ఒకరి కొకరము బోధించు కొందుము. మాటలే బోధిస్తాయి. గనుక ఆ మాటలు విశదముగా యున్నట్లు చూచుకోవాలి. అవి గ్రాహ్యమయ్యేటట్లుండాలి. అవి లేఖనముల ప్రకారముండాలి. ఒక అబద్ధ బోధను పాటల ద్వారా ప్రభోదించుట జరుగరాదు. కొన్ని సూత్రములు గానరూపముగా యుంటే వాటిని సులభముగా గుర్తుంచుకొనగలము. చిన్న పిల్లలకు పాటల ద్వారా బోధించుట చాలా సులభము. వారు సులభముగా, సర్దాగా నేర్చుకొందురు. గనుక పాటల ద్వారా బోధించుట ఉత్కృష్టము, మాటలు మాత్రమే ఉపదేశిస్తాయి. హెచ్చరిస్తాయి గనుక రాగము అంత ప్రాముఖ్యము కాదు. మనము ఆత్మీయ పాటలను పాడాలి. అంతేగాని మనకు నచ్చిన సరదా పాటలు పాడరాదు. కీర్తనలకు, పాటలకు, ఆత్మ సంబంధమైన పద్యములకు ఉన్న తేడా యేమిటని ప్రజలు తరచు అడుగుదురు. వీటి

మధ్యనున్న వ్యత్యాసమును ఖచ్చితంగా మనం చెప్పలేము. ఈ పదములు ఒక దానికొకటి తరచు వాడబడుచున్నవి గనుక వాటి వ్యత్యాసమును గూర్చి పెద్దగా ఆలోచించనక్కరలేదు.

మనము ఒకరికొకరము బోధించుకొందుము. గనుక ఆరాధనలో ఒకరిపై నొకరు ఆధారపడియుందుము. తత్ఫలితముగా ఒండొరులకు క్షేమాభివృద్ధి కలుగును. పాటలకంటె ప్రోత్సహించునది మరొకటి యుండదు. వాటిలో యున్న ఆత్మీయ తలంపులు హెచ్చరించును. మనం ఒకరికొకరము బోధించుకోవాలి గనుక యిది ఒక ప్రాముఖ్యమైన బైబిలు పద్ధతి. సంఘమంతయు పాటలుపాడుట ద్వారా హెచ్చరిక చేయబడును. సంఘములో కొంతమందే గాక, సంఘమంతయు పాటలు కలిసిపాడవలెను. సంఘమంతయు ఏకముగా కలసి చేయుపని పాటలు పాడుట ఒక్కటే

**ఆరాధన ఆత్మీయ యాగము**

"కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). యిది పాత నిబంధనలోని బల్యర్పణ పద్ధతిని సూచించుచున్నది. మరియు పాత నిబంధనలోని భౌతిక బలుల పద్ధతికి బదులు పాటలు పాడుట ఒక ఆత్మీయ బలియాగమని చెప్పబడినది. మన పాటలలో దేవుడు చేసిన గొప్ప మేలు లకు ఆయనను స్తుతించుదుము. ఆయన చేసిన మేలులకు కృతజ్ఞత చెల్లింతుము. గనుక పాటల ద్వారా దేవునితో సంభాషించు చున్నామని మరొకసారి జ్ఞాపకముంచు కొందుము. ఆరాధనలో మన తత్వమంతయు, మన ఆత్మ, హృదయము, మనస్సు, పెదవులు అన్నీ ఇమిడియున్నవి. ఎఫెసీ 5:19లో మన హృదయములో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి యని చెప్పబడినది. మనం పాటలు పాడునప్పుడు మన మనస్సు, హృదయము కూడ మనం పాడే పాటలతో సమన్వయించి

యుండాలి. లేని యెడల మన కీర్తనలు ఒక ఆచారకర్మగా తయారగును. నిష్ప్రయోజనమైన ఆచార కర్మలతో దేవుడు ఎన్నడు సంతోషించడు.

పాటలు సంఘము యొక్క ఐక్యతను చాటును : రోమా 15:6లో క్రైస్తవులు ఏకభావము గలవారై ఏక గ్రీవముగా తండ్రియైన దేవుని మహిమ పరచాలని చెప్పబడినది. సంఘము యొక్క ఐక్యతను ఉద్ఘాటించు అనేక లేఖన భాగములున్నాయి. పాటలు కలసి పాడుట ద్వారా మన మధ్య ఉండవలసిన ఐక్యత సాధ్యమగును. అందువలన సంఘము ఐక్యముగా యుండని యెడల వారు చేయు ఆరాధన గొప్పగా దెబ్బతినును. క్రైస్తవులు ఏకముగా కూడి పాడుటకంటే ప్రోత్సాహకరమైన విషయం మరొకటి యుండదు.

**దేవుడు అనుమతి నిచ్చారు**

ఆరాధనలో మనము చేయు క్రియలకు అనుమతి యున్నదాయని అనేకులు అపార్థము చేసికొంటారు. రెండు విధములైన ఆజ్ఞలున్నవి. సాధారణ ఆజ్ఞలు ప్రత్యేక ఆజ్ఞలు అనునవి. ఏదైనా ఒక సంగతిని గూర్చి చెప్పబడినను అదెట్లు చేయాలో చెప్పక యుంటే అది సాధారణ ఆజ్ఞయగును. అది అట్లుండగా ప్రత్యేక ఆజ్ఞయైతే ఒక పని ఎట్లు చేయబడాలో చెప్పును. కొన్ని సాధారణ ఉదాహరణలను గమనించుము. సర్వలోకమునకు సువార్త ప్రకటించుడియని దేవుడు మనల నాజ్ఞాపించారు. అది సాధారణ ఆజ్ఞ జేలయనగా ఏలాగు వెళ్ళాలో ఆయన మనకు చెప్పలేదు. చితిసారకపు మ్రానుతో ఓడను తయారు చేయమని దేవుడు నోవహుతో చెప్పారు. అది ప్రత్యేక మైన ఆజ్ఞ ఏలయనగా అతడు చితి సారకపు మ్రానునే వాడవలెను. వేరే యితర మ్రానులను అతడు ఉపయోగించకూడదు. సంగీతము అనునది అన్ని రకాల సంగీతమును సూచించును. అది సాధారణ పదము సంగీతమును వాడండి అని దేవుడు చెప్పిన యెడల ఏ రకమైన

సంగీతమునైనను క్రైస్తవులు ఆరాధనలో వాడవచ్చును. అయితే దేవుడు పాటలు, కీర్తనలు అని ప్రత్యేకంగా చెప్పారు. అది మిగతా అన్ని రకాల సంగీతమును బహిష్క రిస్తాది. గనుక వాద్య సంగీతము బహిష్కరింపబడ్డాది. ఏవిధమైన వాద్య సంగీతము వాడరాదని దేవుడు చెప్పక పోయినను ఆయన గాత్ర సంగీతమును కోరగానే వాద్య సంగీతము బహిష్క రింప బడినది.

## వాద్యముల చరిత్ర

మతశాఖల సంఘముల వారనేకులు వాద్య సంగీతమును తమ పాటలతో ఉపయోగిస్తారు. అదెంత ప్రబలమై పోయిందంటే దానిని ప్రశ్నించేవారెవరు లేరు. అయితే సంఘారంభము నుండి అట్లులేదు. గాని గత కొద్ది శతాబ్దముల నుండి వాద్య సంగీతమును ఉపయోగించుట పరిపాటియై పోయినది. దాని నెవ్వరు ప్రశ్నింపరు కూడ. ఆరాధనలో మనము పాటలు మాత్రమే పాడాలని చెప్పబడినది. క్రొత్త నిబంధన ఆరాధనలో వాద్యములను పయోగించుటను గూర్చి కూడ చెప్ప బడలేదు. సంగీతము రెండు రకములు: గాత్రము జంత్రము. ఆరాధన ఆత్మతో యుండాలి గనుక గాన సంగీతముకు ప్రాధాన్యత యున్నది. అయితే వాద్య సంగీతము యొక్క ప్రాధాన్యత భౌతికముగా యుండును. పౌలు మన హృదయం అనే పరికరాన్ని వాడాలని హెచ్చరించాడు.

కొలస్స 3:17లో సమస్తము ప్రభువైన యేసు నామమున చేయబడాలని హెచ్చరింపబడినది. అంటే ఆయన అధికారము చొప్పున ఎట్లు పాటలు పాడగలము? వాద్యములను గూర్చి లేఖనములయితే సంపూర్తిగ మౌనియై యున్నవి. వాటిని ఖండించలేదు గనుక వాద్యోపకరణ సబబేయని అనేకులు చెబుతారు. అయితే లేఖనములు మౌనంగా యుంటే వాద్యములకు అనుమతించినట్లు కాదు.

హెబ్రీ పత్రికలో దీని విషయమై మనము రెండు ఉదాహరణలు చూడ

గలము. హెబ్రీ 1:4–5లో దేవదూతల కంటే క్రీస్తు శ్రేష్టుడై యున్నారని లేఖకుడు తెలియజేయుచున్నాడు. అట్లు చెప్పుచు "నీవు నా కుమారుడవు నేను నేడు నిన్ను కనియున్నానని" ఆయన దూతలతో ఎవనితో నైనను చెప్పెనా? యని అడిగారు. చెప్పలేదు అనునది జవాబు. గనుక క్రీస్తు దూతలకంటే శ్రేష్టుడు. హెబ్రీ 7:13, 14లో యాజకుడు మారుట అవస్యమని లేఖకుడు నిరూపించుటకు ప్రయత్నించాడు. యేసు ఆ యాజకుడగు నిమిత్తము ఒక క్రొత్త ధర్మశాస్త్రము అమలులోనికి రావలసి యున్నది. ఏలయనగా పాతనిబంధనలో యూదా గోత్రము నుండి వచ్చు యాజకుని గూర్చి ఎన్నడు చెప్పలేదు. సరిగదా యాజకులందరు లేవీ గోత్రము నుండియే వత్తురని అది చెప్పినది. లేవీ గోత్రమని చెప్పబడి యున్నది గనుక అది మిగతా గోత్రము లన్నిటిని బహిష్కరించుచున్నది. గనుక మోషే ధర్మశాస్త్ర ప్రకారము క్రీస్తు ప్రధాన యాజకుడు కాజాలడు ఏలయనగా ఆయన లేవీ గోత్రీకుడు కాదు. అదే విధముగా పాటలు పాడుట అధికారికంగా ఆమోదించబడినందున మిగతా రకముల సంగీతము బహిష్కరింప బడినది.

క్రైస్తవ్యము యొక్క చరిత్ర అంతటిలోను వాద్యము వ్యతిరేకించబడినది. సంఘ తండ్రులు ఆరాధనలో వాద్యములనుపయోగించుటను మొదటి నుండి ఎదురాడుచునే యున్నారు. క్రైస్తవారాధనలో అర్గను అను వాద్యము 7వ శతాబ్ధములో మొదట ప్రవేశ పెట్టబడెను. యూదులు తమ ఆలయ ఆరాధనలో వాద్యములనుపయోగించిరి. గ్రీకులు తమ విగ్రహారాధనలో వాటిని ఉపయోగించిరి. గనుక ఆదిమ క్రైస్తవులు వాద్యోపకరణమును గూర్చి ఎరిగియే యుందురు. అయినను ఆదిమ సంఘము వాద్యముల నెన్నడు ఆరాధనలో వినియోగించలేదని చరిత్ర కారులందరు చెప్పుదురు.

అంతే కాకుండ ఆయా మత శాఖలను స్థాపించిన నాయకులు

సయితము వాద్య సంగీతమును వ్యతిరేకించిరి. వారిలో కొందరి మాటలు గమనించుము:

మార్టిన్ లూథర్ : "ఆరాధనలో ఆర్గన్ అను వాద్యము బయలు దేవతా ప్రభావమైయున్నది".

జాన్ కేల్విన్ : "ఆరాధనలో వాద్యము సాంబ్రాణి పొగలవలెను, మైనపు వత్తులను వెలిగించుట వలెను, పాత ధర్మశాస్త్ర ఛాయలను పునరుద్ధరించుట వలెను యున్నది. దీనిని రోమన్ కేథలిక్కులు యూదుల నుండి ఎరువు తెచ్చుకొన్నారు".

జాన్‌వెస్లీ : "మన గుడి... ఆర్గన్ ఉండి అది కనబడకను, వినబడకను యున్న యెడల నాకు అభ్యంతరము లేదు".

క్రొత్తనిబంధన సంఘమును పునరుద్ధరించుట మనధ్యేయము. ఆదిమ క్రీస్తు సంఘము ఆరాధనలో ఎన్నడు వాద్యములను ఉపయోగించలేదు. దానిని తీవ్రముగా వ్యతిరేకించినది. గనుక ఎవడైనను నిజ క్రైస్తవుడైయుండగోరిన యెడల ఆరాధనలో వాద్య సంగీతమునెన్నడు వినియోగించడు, దానిని ప్రోత్సహించడు.

\- జెర్రీబేట్స్

## భేదమును వివేచించుట

క్రీస్తు సంఘం ఆరంభము దైవికము, దానితత్వము ఆత్మీయము, దాని ఉనికి నిత్యము. దేవుని జ్ఞానమునకు అది ఒక గొప్ప చిహ్నము. అది సూక్ష్మమైనది, అందమైనది.

దేవునికి మానవునికి మధ్య పాపము అగాధము సృష్టించెను. వారిద్దరిని సమాధాన పరచునది సంఘము. మానవులందరినీ ఒకే శరీరముగా ఏకపరచవలెననునది దేవుని నిత్య సంకల్పము (ఎఫెసీ 2:16). ఆ శరీరమే సంఘము (ఎఫెసీ 1:22,23). సంఘమును మాత్రమే యేసు రక్షించును (ఎఫెసీ :23). అది సువార్తకు లోబడి రక్షింపబడిన వారందరితో సమకూర్చబడియున్నది (అపో.కా. 2). రక్షించు

టకు సువార్త ఒక్కటి మాత్రమే దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). నోవహు ఓడకు వెలుపల ఎంత మంది రక్షింపబడిరో, సంఘమునకు వెలుపల యున్న వారు సయితము అంతే యున్నారు.

ఇశ్రాయేలు ఆయన జనమై యుండిరి (ద్వితీ 32:10). సంఘము కూడ ఆయన హృదయానందకర మైనదిగా యుండవలెను. సంఘము తన వరుడైన యేసుక్రీస్తుతో నిత్యత్వములో ఏకమగు కాలము కొరకు దేవుడు ఎదురుచూచుచున్నారు.

మతశాఖలు మానవ కల్పితములు. అవి భౌతికమైనవి. వాటి ఉనికి తాత్కాలికము. దేవుడు చెప్పిన దానికంటే మానవుడు తన స్వేచ్ఛాను సారముగ జీవించుచున్నాడు. అందువలన అంతా గందరగోళము. "దేవుని స్వరూపియై యున్న క్రీస్తు మహిమ కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసు లైన వారి మనో నేత్రములకు గ్రుడ్డి తనము కలుగజేసెను" (2కొరింథీ4:4).

డినామినేషన్లు యేసు నాటలేదు అందువలన అవి "పెల్లగింపబడును" (మత్తయి 15:13). వారి ఆరాధన డంబమైనది, యాంత్రికమైనది. దాని రాజ్య నిరీక్షణ భూసంబంధమైనది. వాటి నియమములు ఆచారకర్మమైనవి, సాంప్రదాయకమైనవి. "అబద్ధమార్గములన్నియు నాకసహ్యములు" అని దావీదు చెప్పాడు (కీర్తన 119:128). అయితే వారిని ప్రేమించుదాం, వారి అసత్య మార్గమును ద్వేషించుదాము. పవిత్రమేదో, అపవిత్రమేదో ఇశ్రాయేలీయులు తెలిసికొనవలెను (యెహెజ్కేలు 22:26). క్రైస్తవులు క్రీస్తు స్థాపించిన సంఘముకు, మానవులు స్థాపించిన మతశాఖలకు మధ్యయున్న భేదములను గ్రహించుకొన వలసియున్నది. ఆ తేడా చాల గొప్పది!

- ఫ్రేంక్ చెస్సెర్

# సంఘములన్నీ మంచివేనా?

యేసు ఈ లోకములో జీవించి యుండగా "నా సంఘమును నేను కట్టుదును" అని వాగ్దానము చేసారు (మత్తయి 16:18). ఆయన యేమి నిర్మింపదలచుకొన్నారు?

మన ప్రభువు ఒక డినామినేషన్‌ను స్థాపించ బూనుకొన్నారా? కాదు. డినామినేషన్ అనగా మొత్తములో నుండి విడిపోయిన, నామకార్ధము చేయబడిన భాగము. మన చుట్టూ వందలాది డినామినేషన్లున్నవి. వారు క్రీస్తుకు చెందినవారమని కొంత మట్టుకు చెప్పుకొంటారు. ఆదిమ సంఘ మొత్తములో తాము కొంత భాగమైనట్టు చెప్పుకొంటారు. సార్వ జనిక సంఘ మొత్తములో తామొక భాగమైయున్నామని తలంతురు.

వారు తమ ప్రత్యేకమైన పేర్లు వలనను, బోధలవలనను ఒకరి నుండి మరొకరు వేరుగా యుందురు. వారి అలవాట్లు భిన్నమైనవి. యేసు తన సంఘమును కట్టుదునని చెప్పినపుడు ఆయన మనస్సులో ఒక డినామినేషన్ లేదు. తాను నిర్మించదలచుకొన్నది మొత్తములో ఒక భాగము కాదు గాని అదే సంపూర్ణముగా మొత్తమై యున్నది. పెంతెకొస్తునాడు సంఘము స్థాపించ బడినప్పుడు, రక్షింపబడిన వారు ప్రభువుచే సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2:47). రక్షింపబడినవారు సంఘములో యుంటే, రక్షింపబడిన వారే సంఘమైతే, సంఘము మొత్తము లో ఒక భాగమని గుర్తింపబడనేరదు.

యేసు స్థాపింతునని వాగ్దానము చేసి సంఘము ఆయన రక్తముచే రక్షింపబడిన వారై యున్నారు. అది ఆయన శరీరము అని చెప్పబడినది (కొలస్స 1:18). దానికి ఆయనే శిరస్సు. సువార్తకు లోబడినవారందరు రక్షింపబడి ఆయన శరీరమై సంఘముతో చేర్చబడుచున్నందున ఒకే ఒక్క శరీరమున్నది (ఎఫెసీ 4:4). ఎక్కడైనా ఎప్పుడైనా నమ్మకమైన క్రైస్తవులున్నప్పుడు, వారు దేవుని కృప వలన తమ పాపక్షమాపణ పొంది యున్నారు. క్రీస్తు శరీరముగా, ఆయన నాయకత్వము చొప్పున చలించుచు ఆయనను ఆరాధించుచు, కృషిసల్పుతు

యుందురు (ఎఫెసీ :24; కొలస్స 3:17). యేసు స్థాపించిన సంఘము ఒకే ఒక్కటి. అది ఆయనకే చెందును. ఆయన నామము ధరించును, ఆయన చిత్తము చొప్పున కృషిచేయును.

డినామినేషన్లు క్రీస్తు స్థాపించినవి కావు. క్రీస్తు స్థాపించిన సంఘము వేరు, డినామినేషన్లు లేరు. అందువలన అన్ని సంఘములు మంచివేయని తలంచుట క్రీస్తు అభిమతమునకు విరుద్ధము (మత్తయి 15:13-14).

- వేయిస్ బేరియర్

## సంపూర్ణ సూర్య గ్రహణము

సూర్యునికి భూమికి మధ్యగా చంద్రుడు వచ్చినప్పుడు సూర్యగ్రహణం సంభవించును. అయితే సూర్యునికి చంద్రునికి మధ్యగా భూమి వచ్చినప్పుడు చంద్రగ్రహణం సంభవించును. ఈ గ్రహణములు వేర్వేరుగా యుండును. కొన్ని సంపూర్ణమైనవి మరికొన్ని పాక్షిక మైనవి. ప్రతి సంవత్సరము 2 నుండి 5 గ్రహణములు సంభవించును. అయితే భూమి యొక్క వర్తులాకార చలనము వలన అవన్నీ మనకు కనబడవు. 2017లో ఆగష్టు 17న సంభవించినది సంపూర్ణ సూర్య గ్రహణము. గతంలో 1979లో అమెరికాలో సంపూర్ణ సూర్య గ్రహణం సంభవించెను. తదుపరి సూర్యగ్రహణం 2024 ఏప్రియల్ 8వ తేదీనాడు సంభవించును. నేను నేరుగా ఈ సూర్యగ్రహనములను వీక్షించక పోయినను వాటి ఛాయాచిత్రములను చూచి, ఆశ్చర్యకరమైన దేవుని సృష్టి క్రమమును గూర్చి ఆయనను స్తుతించును.

సూర్యుడు, చంద్రుడు, భూమి మొదలగు గ్రహములన్నియు ఒక కక్ష్యలో (ఆర్బిట్) చలించును. చంద్రుడు భూమి చుట్టూ గంటకు 2288 మైళ్ల వేగముతో తిరుగును. భూమి అయితే సూర్యుని చుట్టూ గంటను 67,000 మైళ్ల వేగముతో తిరుగును. సూర్యుడు పాలపుంత నక్షత్ర వీధి (మిల్కీవే) చుట్టూ గంటకు 483000 మైళ్ల వేగముతో తిరుగును. చంద్రుడు భూమి చుట్టూ ఒకసారి తిరగడానికి 28 రోజులు పుట్టును. సూర్యుని చుట్టూ భూమి ఒకసారి

తిరగడానికి 365.25 రోజులు (365 1/4) పట్టును. పాలపుంత నక్షత్ర వీధి చుట్టూ సూర్యుడు ఒకసారి భ్రమించ డానికి 2 కోట్ల 25 సంవత్సరములు పట్టును!

ఈ గ్రహములన్నిటికి వాటి వాటి స్పీడు, కక్ష్య వేర్వేరుగా యుండును. ఇవన్నీ ఒక దానితో నొకటి సమన్వయ ము కలిగి చలించును. వీటి చలనము ను గూర్చి ఆలోచించునప్పుడు నా చేతి గడియారములో మూడు ముళ్లున్నవి. ఒకటి గంటలది, ఒకటి నిమిషములది, మూడవది సెకనులది. ఈ మూడు ముళ్లు వేర్వేరు వేగములతో చలించును. సూర్యచంద్ర గ్రహణముల వలె ఈ మూడు ముళ్లు ఒక సమయంలో ఒకే చోట సమకూడును. మధ్యాహ్న కాల మందు, మరియు మధ్యరాత్రి యందు ఇది జరుగును. ఈ ఆకాశమండల గ్రహముల గతిమార్గము , గడియారపు ముళ్ల కంటే చాల క్లిష్టమైనవి. దానిని మనం గ్రహించుకొనుట చాల కష్టము. అయినను పరమందలి దేవుడు ఈ విశ్వాన్ని సృష్టించి చలింపచేయుచున్న విధానము ఆశ్చర్యము. మానవ ఊహ తీతము.

విలియం పేలే అనునతడు సృష్టిలో యున్న ఈ క్రమమునుపయో గించి దేవుని ఉనికిని గూర్చి వివరిం చెను. అతడును, మరియు అనేకులును ఈ గడియార ఉదాహరణను తరచు వినియోగించారు. అంతసున్నితముగా పని చేయుచున్న గడియారమున కొక నిర్మాణకు డెట్లుండెనో అట్లే అంతకన్నా క్లిష్టమైన ఈ విశ్వ గడియారమును తయారుచేసిన సృష్టికర్త యొకడున్నాడు. ఆయనే దేవుడు!

"ఆయన అదృశ్యలక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వ మును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచిం చుట వలన తేటబడుచున్నవి. గనుక వారు నిరుత్తరులైయున్నారు. మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు గాని వారు తమ వాదముల యందు వ్యర్థులైరి" యని పౌలు చెప్పాడు (రోమా 1:20, 21). వీక్షించడానికి అనేకులు ఆసక్తి చూపిన సూర్య గ్రహణం సృష్టికర్త

యొక్క ఉనికిని ఆయన అదృశ్య లక్షణములకు ఒక నిదర్శనం.

అయినను కొందరు ఆయనను చూచుటకు నిరాకరిస్తారు. అది విచార కరం. ఆయన యొక్క శక్తి కండ్ల ఎదురుగా కనబడుచున్నను వారు ఆయనను నిరాకరిస్తారు. "కండ్లుండియు చూడని వారికంటే గ్రుడ్డి వారు ఉండరు" అనునానుడి వీరి విషయములో సత్యము. 2017లో సంపూర్ణ సూర్యగ్రహణమును వీక్షించిన వారనేకులు ఆశ్చర్యచకితులైరి. దేవుని యొక్క నిర్మాణ క్రమము వలన సూర్య గ్రహణం లేక చంద్ర గ్రహణం ఎప్పుడు సంభవించునో అది ఏయే ప్రాంతములలో ఎంతసేపు ఉండునో కొన్ని సంవత్సరములకు ముందే మనం చెప్పేయవచ్చును. ఆయన నిర్మించిన ఈ బ్రహ్మాండమైన విశ్వమంతటిలోను ఒక్క సెకను కూడ తప్పుగా చలించదు. ఈ నిర్మాణ క్రమము ఇంత విజ్ఞానముతో కూడి యున్నందునను, ఇంత సున్నితముగా నిర్మించబడి నందునను, దాని నిర్మాణకుడొకడున్నాడని నమ్మక తప్పదు. మన దేవుడు గొప్పవాడు!

## ఎవరు గమనించుచున్నారు?

- డేవిడ్ కెన్నీ

కొన్ని సంవత్సరముల క్రితము మేము ఒక గ్రామ ప్రాంతములో ఇల్లు కట్టుకొనుచున్నాము. ఒకరోజు పని వారంతా వారి వారి పనులలో నిమగ్నమైయున్నప్పుడు మాకు కొంత దూరములో ఉన్న ఒక పొరుగింటాయన మా వద్దకు వచ్చాడు. "నేను ఇక్కడ ఏమి జరుగుతున్నదో చూచుటకు వచ్చాను. నా బైనాక్యులర్లు దీనిని చూచుటకు శక్తివంతముగా లేవు" అని చిరునవ్వు నవ్వుతూ చెప్పెను.

నీవు ఎవరివైనను, లేక నీవు ఏమి చేయుచున్నను నిన్ను ఎవరో ఒకరు గమనించుచున్నారన్నది నిజము. ఆయన కొరకు మంచి కార్యములు చేయుటకు ఇతరులను ప్రేరేపించుటకు మనలను ఏవిధముగా వాడుకొనవలెనో దేవుడు చూచుచున్నారు.

### అపవాది గమనించుచున్నాడు

మొట్టమొదటిగా సాతాను ఆదాము హవ్వలను ఏదేను వనములో వారిని శోధించుటకు సమయము

కొరకు కనిపెట్టుచున్నప్పుడు జరిగినది. అప్పటి నుండి సాతాను దేవుని ఆజ్ఞలను అనుసరించి జీవించు ప్రజల కొరకు నిద్రపోకుండా యున్నాడు.

సాతాను అపోస్తులులను కని పెట్టి చూచినాడు. యేసు పేతురును ఈ విధముగా హెచ్చరించియున్నాడు. "సీమోను, సీమోను ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుమల వల్లె జల్లిం చుటకు మిమ్మును కనిపెట్టుకొనెను" (లూకా 22:31). యూదా దేవుని కుమారుని ముప్పది వెండి రూకలకు శత్రువులకు అప్పగించుటకు సమర్థు డని సాతాను బాగుగా ఎరిగెను. ఇప్పుడు క్రీస్తు అనుచరులను సాతాను కనిపెట్టుట లేదు అనుటకు ఏమైనా కారణమున్నదా?

బైబిలు అంతటి యందు దేవుని ప్రజలు ఆయా సమయములందు గమనింపబడిరి అనుటకు అనేక ఉదాహరణలు గలవు. ఎస్తేరు గ్రంథములో మొర్దెకై యూదుడైనందున హామాను అతనిని గమనించి అతడు హామనుకు నమస్కరించనందు వలన మొర్దెకైను అసహ్యించుకొని మొర్దెకై కొరకు ప్రణాళికను వేసెను. ఆ ఉద్దేశము నెరవేరలేదు. కాని మొర్దెకై బదులు హామాను ఉరి తీయబడెను.

### ప్రజలు గమనించుచున్నారు

దానియేలు మరియు అతని స్నేహితులు ప్రతిమకు నమస్కరించుమను ఆజ్ఞకు లోబడుటకు బదులుగా వారు నిజదేవునికి ప్రార్థించిరి. సింహముల గుహగాని, భయంకరమైన అగ్ని గుండము గాని వారికి హానీ కలుగ జేయలేదు. ప్రతీ సారీ హెబ్రీయులైన ఈ ప్రజలు దేవుని యందు నమ్మికయుంచుట వలన, ఆ రాజులు విశ్వాసులుగా మారిరి.

యేసు వెళ్ళిన ప్రతీచోట ప్రజలు ఆయనను గమనించుచుండిరి. కొందరు ఆయనను ఎలాగైనను పట్టుకొనవలెనని చాలామంది ఆయన ప్రతి కదలికను జాగ్రత్తగా గమనించు చుండిరి. చాల మంది జన సమూహము ఆయనను గూర్చి తెలిసికొనవలెనని కోరిక కలిగి యుండిరి. "నన్ను చూచినవాడు నా తండ్రిని చూచి యున్నాడని" యేసు చెప్పెను (యోహాను 14:9). యేసు శాంతము,

దయ, ప్రేమ గలవాడు మరియు ప్రతీ ఒక్కరికొరకు జాగ్రత్త వహించినవాడు ఆయనను అనుసరించు వానికి ఈ లోకమందు మంచి జీవితమును, పరలోకమందు నిత్యజీవమును అనుగ్రహిస్తానని వాగ్దానము చేసెను.

యేసు చనిపోయి, తిరిగిలేచి పరలోకమునకు ఆరోహణమయిన తరువాత అపోస్తులులు ఆయన మానవులు కొరకు చేసిన గొప్ప కార్యమును గూర్చి ప్రచురించుచుండిరి. వారి జీవితము, వారి బోధలు అనేక మంది రక్షణ పొందుటకు దోహద పడినవి.

## క్రైస్తవులు గమనించబడాలి

క్రైస్తవులు గమనించబడవలెనని యేసు కోరుచున్నారు. ఆయన కొండ మీద ప్రసంగములో (మత్తయి 5వ అధ్యా) ఈలాగు చెప్పుచున్నారు. "మీరు లోకమునకు వెలుగై యున్నారు" క్రైస్తవుని వెలుగు యొక్క ఉద్దేశమే మనగా ప్రకాశింపబడుట మాత్రమే గాక పరీక్షింపబడవలెను. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి ఎదుట మీ వెలుగును ప్రకాశింపనీయుడి" అని ఆయన చెప్పెను.

అవిధేయుడైన భర్తగల స్త్రీకి పేతురు ఈ విధముగా సలహా ఇచ్చు చున్నాడు "స్త్రీలారా మీరు మీ స్వ పురుషులకు లోబడి యుండుడి. అందు వలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ ప్రవర్తన చూచి వాక్యము లేకుండానే తమ భార్యల (1పేతురు 3:21) నడవడి వలన రాబట్టబడ వచ్చును".

చాలా కాలము నుండి తల్లిదండ్రులు వారి పిల్లలకు క్రమశిక్షకులుగా యుండుట కంటే వారితో స్నేహితులుగా ఉండుట మంచిదని నమ్ము చున్నాము. పిల్లలను మంచిగా పెంచుట అనునది ప్రశ్నార్ధకమై యున్నది. తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచి మాదిరిగా యుండవలసిన అవసరతను వారు గుర్తించాలి.

పౌలు తిమోతి యొక్క తల్లి మరియు అవ్వ యొక్క మాదిరిని పొగడుచున్నాడు. 2తిమోతి 1:5లో

పౌలు ఈలాగు వ్రాయుచున్నాడు: "ఆ విశ్వాసము మొదట నీ అవ్వయైన లోయిలోను, నీ తల్లియైన యూనీకే లోను వసించెను. అది నీయందు సహా వసించుచున్నదని, నేను రూఢిగా నమ్ము చున్నాను".

తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచుటలో పొరపాట్లు చేసినప్పటికి, వారు మరి శక్తివంతముగా వారిని ప్రభావితం చేయాలి. పాతనిబంధన గ్రంథములో దావీదు యొక్క పాపములు ఎన్నో అందరు గమనించగల్గునట్లు లిఖింపబడియున్నది. కాని నిజానికి అతడు ఎల్లప్పుడు నిజదేవుని వెంబడిం చిన వాడని మనము జ్ఞాపకము చేసి కొనవలెను. అతని కుమారుడైన సొలోమోను, అతని వంశీకుడైన యెహోషాపాతు ఆయన మాదిరిని అనుసరించారు గనుక వారు శ్లాఘించ బడినవారు. 1రాజు 9:4 మరియు 2దినవృత్తా 17:3 ఈ సత్యాన్ని రూఢి పరచుచున్నది.

నీ మాదిరి యెట్టిది ?

క్రైస్తవులకు క్రీస్తు మాదిరి యైనట్లయిన మనము ఇతరులచే ప్రేరేపింపబడుదుము. అదే సమయము లో మనము మాదిరిగా యుందుము. ఆత్మలను వెదుకుటలో మన మాదిరి వారిని ప్రేరేపించు చున్నాదా? లేక నిరుత్సాహపరచు చున్నాదా?

ఈ మధ్య నేను ఒక స్నేహితు రాలికి ఒక సమాచారము పంపితిని. ఆమె యొక్క భక్తి, ప్రభువు పనికై ఆమె పడు ప్రయాస నన్ను ప్రేరేపించినది అని వ్రాసితిని. ఆమె చాలా ఆశ్చర్య పడినది. ఏ ఒక్కరికీ తాను ప్రేరణగా యున్నట్లుగా తాను గమనించలేదు.

సహోదరులారా, మీరు ప్రేమ యందు మరి ఎక్కువగా అభివృద్ధి చెందవలెననియు, సంఘమునకు వెలుపటి వారి యెడల మర్యాదగా నడుచుకొనుచు మీకేమియు కొదువ లేకుండునట్లు మేము మీకాజ్ఞా పించిన ప్రకారము పరుల జోలికి పోక, మీ సొంత కార్యములను జరుపుకొనుట యందును మీ చేతులతో పనిచేయుట యందును ఆశ కలిగి యుండవలెననియు మిమ్మును హెచ్చరించు చున్నాము (1థెస్స 4:11,12).

- ఫ్రాన్సిస్ ఫార్

# సంక్షిప్త వార్తలు

2020 డిశంబరు 20వ తేదీ ఆదివారమున దైవజనులు అత్యంత ప్రీతి పాత్రులైన బ్రదర్ ముప్పిడి సామ్యూల్ రాజు గారు (బిక్కవోలు) ప్రభువు నందు నిద్రించిరి. ఆయన కొంతకాలము అస్వస్థతకు గురియై మెరుగైన వైద్య సహాయము కొరకు చెన్నయ్ వెళుతూ మార్గమధ్యలో అశువులు బాసిరి. భారతదేశములోను, అమెరికాలోను కూడ సామ్యూల్ రాజు గారు అనేక వేలకొలది క్రీస్తు సంఘస్థులకు చిరపరిచుతులే.

సామ్యూల్‌రాజు గారు గొప్ప దీర్ఘదృష్టి కలిగిన అలుపెరగని సువార్తికుడు. బిక్కవోలు, సింగంపల్లి, విశాఖపట్టణములలో బైబిలు కాలేజీలను స్థాపించి అనేక వందలాది సువార్తికులను తయారుచేసిన గొప్ప బైబిలు బోధకుడు. ఆయన ఎంత ఎదిగినా ఒదిగియే జీవిస్తు గొప్పమాదిరి నెలకొల్పారు. డిశంబరు 26వ తేదీ శనివారం వేలకొలది ప్రజల అశ్రునయనాలతో ఆయన భూస్థాపన కార్యక్రమము జరిగినది. ఆయన మరణము తెలుగు క్రీస్తుసంఘాలలో గొప్ప అగాధమును కల్పించినది. ఆయన విడిచి వెళ్లిన సతీమణికి, కుమారులు, కుమార్తెలు, మనుమలకు దేవుడు ఆదరణ దయచేయునట్లు ప్రార్థించమనవి.

2020 డిశంబరు 16వ తేదీన తూర్పుగోదావరి రౌతులపూడి మండలం రాజవరంలో రిక్కీగూటం గారి ఆధ్వర్యములో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. ఆ సదస్సుకు ఇంచుమించు 85 మంది సువార్తికులు హాజరైరి. సోదరులు యమ్. శాంతారావు గారు నాయకత్వము వహించి సదస్సును ఘనముగా జరిగించిరి. సోదరులు దయాకర్ గారును, ఆయనతో అనకాపల్లి నుండి వచ్చిన మరి యిద్దరును, రిక్కీగూటం గారును వాక్యపరిచర్య చేసిరి. హాజరైన వారందరు నూతనోత్సాహభరితులైరి.

2020 డిశంబరు 22వ తేదీ మంగళవారము చింతపల్లి ఏరియా సువార్తికుల సదస్సు సోదరులు బి. అలెగ్జాండర్ కేంబెల్ గారి ఆధ్వర్యమున జరిగెను. ఇంచుమించు 60 మంది సువార్తికులు హాజరైరి. రిక్కీగూటం గారు వారినందరినీ ఉద్దేశించి చక్కటి వాక్యపరిచర్య చేసిరి. వచ్చిన వారందరికీ రిక్కీ గారు చలిసంబంధమైన దుస్తులను, మంకీకేప్‌లను, చేతులకు గ్లోవ్స్‌ను బహూకరించిరి.

2020 డిశంబరు నెలలో అమెరికాలో రోనీగూటం గారు గాస్పుల్ బ్రాడ్ కేస్టింగ్ నెట్‌వర్క్ స్టూడియోలో అమెరికాలోని ప్రముఖ బైబిలు పండితులతో కలసి చర్చాకార్యక్రమములో పాల్గొనిరి. ఆ ప్రోగ్రాము అమెరికా దేశమంతా జనవరి నెలలో ప్రసారము చేయబడును. వాటిని యూ ట్యూబ్‌లో కూడ మనం చూడవచ్చును. సమయవివరములకు సత్యవాణి ఆఫీసుకు ఫోన్‌చేసి తెలిసికొన వచ్చును.

సత్యవాణిస్కూల్ ఆఫ్ ఇవాంజలిజమ్ ఇప్పుడు ఆన్‌లైన్‌లో కూడ జరుగుచున్నది. ఆసక్తిగలవారు మీ ఇంటి వద్దనే బైబిలును నేర్చుకొనవచ్చును. వివరములకు సత్యవాణి ఆఫీసును సంప్రదించండి. ఈ నూతన సంవత్సరములో ప్రభువు మనందరికీ తోడైయుండును గాక!

**RNI Regd.No. 69973/98**
**Postal Regd.No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**
**పోస్టుబాక్సు-80**
**కాకినాడ - 533 001**
**ఆంధ్రప్రదేశ్**

**ప్రచురణ తేదీ: ప్రతీ నెల 9వ తేదీ**
**పోస్టు చేయు తేదీ: ప్రతీ నెల 15వ తేదీ**

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ 533004